జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 19-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 487 పేజీలు: 4 వెల : రూ.7



# పటాకులు ధరలు.. పేలుతున్నాయ్!

* ఆకాశాన్ని అంటిన బాణసంచా రేట్లు
* సామాన్యులకు అందనంత దూరంలోనే
* జిల్లాలో 22 తాత్కాలిక దుకాణాలు మంజూరు
* మంజూరు కాకుండానే వెలసిన షాపులు
* షాపుల వద్ద అమలుకాని నిబంధనలు
* చోద్యం చూస్తున్న పోలీస్, ఫైర్ అధికారులు

**శ్రీకాకుళం, అక్టోబరు 18(వార్త):** చిచ్చుబుడ్డి ధర సుర్రుమంటోంది.. మతాబులు మంటపెడుతున్నాయి.. కాకర్లు కాలుతున్నాయి.. హండ్రెడ్ వాలాలు పేలుతున్నాయి.. ఇలా బాణసంచా సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటాయి. ఈ ఏడాది దీపావళి చేసుకోవాలంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత ఏడాది కన్నా ఈసారి ధరలు మరింతగా పెరిగాయి. వెయ్యి రూపాయలకు కేవలం ఫ్యామిలీ ప్యాక్ మాత్రమే వస్తోంది. రెండు వేలు తీసుకువెళితే తప్ప సామగ్రి కంటికి కనిపించడం లేదు. జిల్లాలో 12 వరకూ ఏడాది వరకూ బాణసంచా విక్రయించే షాపులు ఉన్నాయి. ఈ ఏడాది దీపావళికి ముందు రెండు రోజులు విక్రయించేందుకు సుమారు 50 షాపులకు అనుమతి ఇచ్చారు. వీటిలో శ్రీకాకుళం నగరానికి సంబంధించి 22 తాత్కాలిక షాపులు మంజూరు చేశారు. వీటిని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్నారు. మంజూరు కాకముందే కొందరు షాపులను ఏర్పాటు చేసేశారు. బాణసంచా విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు అమలుకావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. నిర్వాహకులు ఎవరికి నచ్చిన విధంగా వారు షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు నిబంధనలు పాటించాలని చెబుతున్నప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదు.

## రూ.7 లక్షల విలువైన బాణాసంచా సీజ్

*** కంచిలిలో నాలుగు షాపులపై కేసులు**

**సోంపేట/కంచిలి అక్టోబరు18(వార్త):** బాణాసంచా వ్యాపారుల అత్యాశ అసలుకే మోసంగా మారింది. నిబంధనల ప్రకారం కొద్ది మొత్తానికే అనుమతులు పొంది అధికారుల కళ్ళు కప్పి భారీ మొత్తంలో తెచ్చిన బాణాసంచాను పోలీసులు సీజ్ చేసిన సంఘటన కంచిలి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దీపావళి పండగ సందర్భంగా బాణాసంచా విక్రయాలకు కంచిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు వ్యాపారులు అనుమతులు సంపాదించుకున్నారు. జాతీయ రహదారి పక్కనే కంచిలి మొదలుకొని జాడుపూడి వరకు ఎవరికి వారుగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. సదరు వ్యాపారులు నిబంధనలు బేఖాతరు చేస్తూ అధిక మొత్తంలో బాణాసంచా దుకాణాల్లో నిలువ చేశారు. శుక్రవారం రాత్రి సోంపేట సీఐ మంగరాజు కంచిలి ఎస్సై పారినాయుడు సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో సుమారు 7 లక్షల రూపాయలు విలువైన బాణాసంచాను సీజ్ చేశారు. ఈ నలుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పారినాయుడు తెలిపారు.

### కేసుల వెనుక ఆరోపణలు..

బాణాసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం పట్ల వ్యాపార వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. దీనికి గల కారణాలపై వార్త ప్రతినిధికి అందిన సమాచారం మేరకు మందు గుండు వ్యాపారుల నుంచి పోలీసు వర్గాలు పెద్ద మొత్తంలో మామూళ్లు వసూలు చేశారని జిల్లా పోలీస్ బాస్‌కు వారిలో ఒకరు ఫిర్యాదు చేయడం స్థానిక పోలీసులను ఆగ్రహానికి గురిచేసినట్లు తెలుస్తోంది. అనుమతులు ఇచ్చిన తమపైనే అనవసర ఆరోపణలు చేయడం పట్ల జీర్ణించుకోలేని పోలీసులు తామెంటో చూపిస్తామని దాడులకు పాల్పడినట్టు సమాచారం.

## నిబంధనలు పాటించాల్సిందే

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

అనుమతులు లేని షాపులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. సారవకోట మండలం తర్లిపేట గ్రామంలో బాణసంచా షాపులను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చల్లవానిపేట జంక్షన్ డిఎంఆర్ క్రేకర్స్ షాపునకు సరియైన అనుమతులేకుండా విక్రయాలు చేస్తున్నందును షాపుపై కేసు నమోదుకు అధికారులను ఆదేశించారు. అనంతరం చల్లవానిపేట దగ్గరలో ఉన్న శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ బాణసంచా షాపును తనిఖీ చేశారు. వీరికి అనుమతులున్నప్పటికీ విద్యుత్ శాఖ నుంచి నిరంభ్యంతర పత్రం లేనందు వల్ల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## కేసులు పెడతాం

*** ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి**

దీపావళి పండుగ చేసుకునే సమయములో ఎంత కాంతి, ఆనందాన్ని ఇస్తుందో... వికటిస్తే అంతే చీకటినీ, విషాదాన్ని తెచ్చిపెట్టి అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ హిత దీపావళిని చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. పోలీస్ శాఖతో పాటు, సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందిన తరువాత మాత్రమే బాణాసంచాను విక్రయించాలన్నారు. బాణాసంచా షాపులను మైదానం లేదా ప్రజల నివాసము ప్రదేశానికి దూరంగా మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించాలని సూచించారు. బాణాసంచాను అక్రమంగా తయారు చేయడం, నిలువ ఉంచడం, అమ్మడం, కొనడం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. తక్కువ కాలుష్యం కలిగించే గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే వినియోగించాలని కోరారు. లైసెన్స్ లేని దుకాణాలు, గోదాములు లేదా రోడ్ల పక్కన అక్రమంగా బాణసంచా విక్రయిస్తే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. రాత్రి 10 గంటల తర్వాత బాణసంచా కాల్చడం నిషేధమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

# సండే.. సైకిల్ దేగా మార్చుకుందాం

* స్వచ్ఛతలో దేశంలోనే ఉత్తమంగా శ్రీకాకుళంను నిలుపుతాం
* శుభ్రత మన జీవితంలో ఒక భాగం కావాలి
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* అరసవల్లి నుంచి ఖాజీపేట రహదారిలో స్వచ్ భారత్


2లో

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


2లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గొల్లపేటలో శిథిలావస్థలో పాఠశాల భవనం



**జలుమూరు, అక్టోబరు 18(వార్త):** జలుమూరులోని గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో బిక్కుబిక్కుమంటూ పాఠశాల కొనసాగిస్తున్నామని హెచ్ఎం జి. మాధవి తెలిపారు. స్థానిక పాఠశాలలో రెండు భవనాలు ఉన్నాయని, ఒకటి నూతనంగా నిర్మించగా మరొకటి శిథిలావస్థకు చేరుకున్నా తరగతులు నిర్వహించవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. మరమ్మతులు చేపట్టాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

# సండే.. సైకిల్ డేగా మార్చుకుందాం

*** స్వచ్ఛతలో దేశంలోనే ఉత్తమంగా శ్రీకాకుళంను నిలుపుతాం * శుభ్రత మన జీవితంలో ఒక భాగం కావాలి * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * అరసవల్లి నుంచి ఖాజీపేట రహదారిలో స్వచ్ భారత్**



**శ్రీకాకుళం, అక్టోబరు18(వార్త):** ఇకపై సండేను అందరూ సైకిల్ డేగా మార్చుకుందామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. స్వచ్ఛతలో దేశంలోనే ఉత్తమంగా శ్రీకాకుళంను నిలుపుతామని, దీనికి ప్రజల సహకారం అవసరమన్నారు. శనివారం శ్రీకాకుళం కార్పోరేషన్ పరిధిలోని అరసవల్లి నుంచి ఖాజీపేట రహదారిలో స్వచ్ భారత్, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కేంద్ర మంత్రి పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్డును ఆనుకుని మొక్కను నాటారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం మూడవ శనివారం స్వచ్ఛంద్ర కార్యక్రమం పంచాయితీ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ జరుగుతూ లక్ష్యాల సాధన దిశగా సాగుతోందన్నారు. స్వచ్ఛత మన నిజ జీవితంలో భాగం కావాలని.. మన ప్రతీ ఆలోచనలో కూడా స్వచ్ఛత ఉండాలన్నారు. వాయు కాలుష్య నివారణ థీమ్‌తో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరుగుతోందని, పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో వాయు కాలుష్యం కూడా పెరుగుతూ ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఢిల్లీ ఈ తరహా వాయు కాలుష్య ఇబ్బందితో బాధపడుతూ ఉందని తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యపై మేల్కొని కాలినడక, సైకిల్ వాడకంపై దృష్టి సారించాలని కోరారు. డస్ట్ పొల్యూషన్ కూడా వాయు కాలుష్యానికి మరో కారణం అని.. నిర్మాణాలు చేపట్టే సమయంలో చుట్టూ పరదాలతో కప్పి ధూళిని నియంత్రించాలన్నారు. తల్లి పేరుపై ఓ చెట్టు నాటాలి అనే బృహత్తర కార్యక్రమానికి ప్రధాని మోదీ పిలుపునిచ్చారనీ.. మన కుటుంబాలలో జరిగే శుభకార్యాలలో సైతం పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. గత సీజన్లో శ్రీకాకుళంలో ఇరవై ఐదు లక్షలలో పైగా మొక్కలను నాటడం జరిగిందని.. ఇవి సమీప భవిష్యత్తులో మంచి ఫలితాలు ఇస్తాయని స్పష్టం చేశారు. దేశంలోనే టాప్ 10లో శ్రీకాకుళం నిలవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్దామని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో సైక్లింగ్ ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి ఇటు పర్యావరణానికి, అటు ఆరోగ్యానికి మేలు కలిగేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గూగుల్ విశాఖకు రావడం చరిత్రాత్మకమని, ఈ విషయంలో కొందరు విమర్శలు చేస్తుండటం బాధాకరమన్నారు. అన్ని జిల్లాలకు సమాంతరంగా ఐటి విప్లవం విస్తరిస్తోందని, నా వరకు కూడా జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పలాస విమానాశ్రయ ఏర్పాటు కోసం అందరితో కలసి ముందుకు వెళ్తున్నామని.. అందరికీ న్యాయం చేసే అడుగు ముందు వేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఈవో, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

*** శ్రీకాకుళం, కాకినాడలో ఘటన**





**శ్రీకాకుళం, అక్టోబరు 18 (వార్త):** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంకదార సత్యన్నారాయణ (64) మృతి చెందారు. ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న అనకాపల్లి డిపోకి చెందిన ఎక్స్ ప్రెస్ సర్వీసు బస్సు అంబేద్కర్ కూడలి దాటిన తర్వాత సమయంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల రోడ్డు నుంచి బైక్‌పై మీద వచ్చిన సత్యన్నారాయణ వాహనం ఒక్కసారి ఢీకొన్నాయి. ద్విచక్రవాహనంతో పాటు బస్సు వెనుక చక్రాల కింద సత్యన్నారాయణ పడి పోయారు. ఆ చక్రాల కింద నలిగిపోయి ఆయన అక్కడికక్కడే చనిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణను చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వంకదార సత్యన్నారాయణ బిల్డర్‌గా గుర్తింపు పొందారు. శ్రీకాకుళం నగరంలోని రాధాకృష్ణ నగర్‌లో నివాసముంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కాకినాడ పత్తిపాడు జంక్షన్ వద్ద..





**ఇచ్ఛాపురం,అక్టోబరు18(వార్త):** ఆ జంటకు పెళ్ళైన రెండు నెలలకే మృత్యువు కబళించింది. సెలవులకు విహార యాత్ర చేద్దామనుకున్న ఆ జంటను రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. వివరాలు లోకి వెళ్తే ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టికి చెందిన పిట్ట వసంత్ కుమార్(32) భార్య సంధ్య ద్విచక్ర వాహనంపై అరకు విహార యాత్రకు బయలు దేరి వెళ్లారు. శని, ఆది వారాలు సెలవు దినం సోమవారం దీపావళి కావడంతో అటునుంచి కాకినాడ వైపు వెళ్లారు. కాకినాడ జిల్లా పత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆగి ఉన్న రెయ్యిల మేత లోడు లారీ ని ఢీకొనడంతో వసంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంధ్య పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఈమె కూడా మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెల్లు పడ కి చెందిన బడే ఆదినారాయణ చంద్రమ్మ ల కుమార్తె సంధ్య తో వివాహం జరిగింది. వసంత్ నూజివీడు సాఫ్ట్ వేర్ కంపెనీ లో చార్టెడ్ అకౌంటెంట్ గా పని చేస్తున్నాడు. వసంత్ మృతి తో బెల్లు పడ లొద్దపుట్టి లలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## స్వదేశీ వస్తువులకు ఆర్థిక భరోసా జీఎస్టీ 2.0

**కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**




**శ్రీకాకుళం, అక్టోబరు18(వార్త):** జీఎస్టీ 2.0 తో మంచి సంస్కరణలు అమలు అయ్యాయని కేంద్ర పౌర విమానయన శాఖామంత్రి మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్స్ లో గడిచిన కొద్ది రోజులుగా సిక్కోలు ఉత్సవ్ పేరుతో జరుగుతున్న సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఆలోచనతో జీఎస్టీ 2.0 కు ప్రధాని మోదీ ఆలోచన చేశారని.. అందుకు తగ్గట్టుగానే ఈ నెలరోజుల్లో అనేక మార్పులను చూశామని స్పష్టం చేశారు. దేశంలో ప్రతీ ఒక్కరు జీఎస్టీ 2.0 లబ్ధిని పొందారన్నారు. జీఎస్టీ 2.0 విప్లవాన్ని ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ నే వినియోగించుకుంటోందని.. అందుకే ప్రధాని మోదీ కూడా మన రాష్ట్రంలో కర్నూలులో జరిగే కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. స్వదేశీ వస్తువుల వాడకం.. జీఎస్టీ 2.0 లబ్ధికి జోడించాలని రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరు తమ జీవితంలో వీలున్నంత ఎక్కువగా టార్గెట్ పెట్టుకోవాలన్నారు. హడావిడి ఎక్కువగా ఉన్న వస్తువులనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని.. మేడ్ ఇన్ ఇండియా వస్తువుల మార్కెటింగ్ తక్కువగా ఉండటానికి ఇది ఒక కారణమన్నారు. జీఎస్టీ 2.0లో దాగి ఉన్న రహస్యం దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడమే అని.. భారతీయుడిగా అది మన బాధ్యత అని గుర్తు చేశారు. భారతీయులని చెప్పుకుంటూ తయారైనా ప్రతీ వస్తువు మేడ్ ఇన్ ఇండియా గానే పరిగణించాలని అన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు వృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతీయుల మార్కెట్ కూడా చాలా విశాలమైనదని.. ఈ తరహా ప్రోత్సాహం అందిస్తే మరింత వృద్ధి చెందుతుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోనే జీఎస్టీ.2.0 తొలి నెల్లలో రెండు వేలకు పైగా వాహన విక్రయాలు జరగడం శుభసూచకం అని అన్నారు. ఢిల్లీలో ఏ తరహాలో జీఎస్టీ 2.0 ఉత్సవాలు జరిగాయో.. అందుకు తీసిపోని స్థాయిలో శ్రీకాకుళం లో సైతం ఉత్సవాలు సందడిగా సాగాయని.. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్, జిల్లా స్థాయి అధికారులు, వ్యాపార వర్గ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానం ద్వారా అజ్ఞానం పారద్రోలడమే దీపావళి

**పలాస,అక్టోబరు18(వార్త):** జ్ఞానము ద్వారా అజ్ఞానము పారద్రోలడమే దీపావళి అని సత్య సాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం అన్నారు. శనివారం రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్ పాఠశాల ఆవరణలో దీపావళి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం కొంతమంది విద్యార్థులు దీపము ఆకారములో కూర్చుని అందరినీ అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు తాలాసు శ్రీను, పూర్వపు కార్యదర్శి మల్లా శరత్ బాబు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, మురళీ, సాంబమూర్తి, దాలేటి, లావణ్యకృష్ణ, వార్డెన్ చంద్రశేఖర్, మౌనిక, అనిత, పురుషోత్తం మమత, దుర్గా విద్యార్థిని పాల్గొన్నారు.

## పీఏసీఎస్ అధ్యక్షురాలుగా విజయలక్ష్మి



**కోటబొమ్మాళి, అక్టోబరు18 (వార్త):** సరియపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మిని కోటబొమ్మాళి మండల పిఏసిఎస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే శ్రీజగన్నాధపురం గ్రామానికి చెందిన ఎస్ ఆనందరావు, కోటబొమ్మాళికి చెందిన ఎస్ రామ్ కుమార్లు డైరెక్టర్లుగా నియమించబడ్డారు. ఈ సందర్భంగా వారు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. వీరు పిఏసిఎస్ అధ్యక్షులుగా డైరెక్టర్లుగా నియమింపబడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## జీఎస్టీ తగ్గింపుతో దిగివచ్చిన వాహన ధరలు

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు18(వార్త):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ పన్నులను తగ్గించడంతో వాహన ధరలు తగ్గుముఖం పట్టాయని టెక్కలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంజీవరావు తెలిపారు. శనివారం నరసన్నపేట ప్రధాన రహదారిలో ఒక వాహనాల షోరూం వద్ద ద్విచక్ర వాహన మెకానిక్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహన ధరలతో పాటు స్పేర్ పార్టులు ధరలు కూడా తగ్గాయని వివరించారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎస్ఐ అసిరి నాయుడు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం నీడలో గ్రంథాలయం



**జలుమూరు, అక్టోబరు18 (వార్త):** జలుమూరు మండలం నగరికటకం గ్రామం లో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయం ప్రస్తుతం నిర్లక్ష్యం నీడలో దర్శన మిస్తుంది. నగరికటకం గ్రామంలో సుమారు 15 ఏళ్ల క్రితం గ్రంథాలయానికి ప్రభుత్వమే శాశ్వత భవనం నిర్మించింది. ప్రస్తుతం ఈ భవనం వినియోగించకపోవడంతో శిథిలావస్థలో ఉందని, చెత్త నిలయంగా దర్శనమిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. పాఠకులకు ఉపయోగపడే ఈ గ్రంథాలయ భవనం మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పోక్సో యాక్ట్ పై అవగాహన

**నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు18(వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం-4 ఇన్ ఛార్జ్ నారాయణరావు ఆధ్వర్యంలో పోక్సో యాక్ట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో యాక్ట్, శక్తి యాప్ డౌన్లోడ్ వినియోగం, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, గుడ్ టచ్ %బాడ్ టచ్, జువైనల్ జస్టిస్ యాక్ట్ మొదలగు అంశాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు జనార్దన, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## కనువిందు చేసిన నల్ల కొంగలు

**సోంపేట, అక్టోబరు18 (వార్త):** సోంపేటలో నల్ల కొంగలు శనివారం అనేకమందిని కనువిందు చేశాయి. సాధారణంగా ఎప్పుడూ తెల్ల కొంగలనే చూస్తూ ఉంటాము. కానీ పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం ఉదయం తెల్ల కొంగలతో పాటు నల్ల కొంగలు కూడా కలిసి తిరుగాడుతూ ఉండటాన్ని అధ్యాపకులు గమనించారు. ముందుగా కొంగలతో కలిసి ఉన్నవి కాకులని భావించారు. నిశితంగా పరిశీలించిన అధ్యాపకులు నల్లగా ఉన్నవి కాకులు కావని అవి కూడా కొంగలని నిర్ధారించారు. ఇటువంటి దృశ్యం తమకు ఎంతో కనువిందు చేసిందని విద్యార్థులు పేర్కొన్నారు.




జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కోటి సంతకాల సేకరణ

**ఇచ్ఛాపురం, అక్టోబరు18 (వార్త):** టి.బరంపురం, అరకభద్ర గ్రామంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ మరియు నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త పిరియా విజయ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల వ్యవహారంలో అనుసరిస్తున్న ప్రైవేట్ తప్పుడు విధానాలకు నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాలు ప్రజల నుంచి సేకరించే కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, సీడాప్ మాజీ కార్పొరేషన్ ఛైర్పర్సన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి,ఎంపీపీ బోర పుష్ప, కారింగి మోహనరావు, ఎంపీటీసీ సాడి కాంచన, ఎంపీటీసీ ప్రతినిధి ఆశి కేదారి, నీలాద్రి, గ్రామ పెద్దలు, మహిళలు, కార్యకర్తలు మొదలగు పాల్గొన్నారు.



## స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగస్వాములు కండి

**జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ**

**పలాస, అక్టోబరు 18(వార్త):** స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జెడ్పీ సీఈవో డి.సత్యనారాయణ కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రతీ మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ లో భాగంగా నగరంపల్లి జడ్పి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎంపీడిఓ ఎన్.రమేష్ నాయుడు, డీప్యూటీ ఎంపీడిఓ తిరుమలరావు హాజరయ్యారు. అక్టోబరు థీమ్ స్వచ్ఛ గాలి – కాలుష్య నివారణలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించి, అనంతరం సైకిల్ ర్యాలీ, పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు.



కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.హేమ రావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మిపతి, ఎస్.చక్రవర్తి, ఎం.ఉపేంద్ర, ఉపాధ్యాయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మీడియాపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి : శాంతి




**కొత్తూరు, అక్టోబరు 18(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ముఖ్యంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు, అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతోందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీరుపై ప్రజాస్వామిక వాదులు, పాత్రికేయ సమాజం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయని ఆమె తెలిపారు. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభం వంటి పత్రికా రంగంపై దాడులను, పాత్రికేయుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రెడ్డి శాంతి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న 'సాక్షి' పత్రికపై అక్రమ కేసులు బనాయించడం, ఆ పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి గారిని వేధించడం వెంటనే మానుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆమె అన్నారు. ప్రతిపక్షం పట్ల, ప్రభుత్వ విధానాలను విమర్శించే వారి పట్ల టీడీపీ ప్రభుత్వం అసహనం ప్రదర్శిస్తోందని, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి రాష్ట్ర యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడితో సమానమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి, ప్రతిపక్షంపై అక్రమ కేసులు, మీడియాపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తోందని, ప్రతిపక్ష నాయకులను, వారికి మద్దతిచ్చే వారిని భయపెట్టాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను అణచివేయాలని చూస్తే, ప్రజాస్వామ్య విలువలు మంటగలుస్తాయని హెచ్చరించారు. సాక్షి పత్రికపై, ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆమె కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మొక్కలతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభ్యం

**పలాస, అక్టోబరు 18(వార్త):** మొక్కలు విరివిరిగా నాడితేనే స్వచ్ఛమైన ఆక్సిజన్ లభ్యమవుతుందని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శనివారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జంట పట్టణాలలో గల అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈనెలలో ప్రాధాన్యతాంశమైన "క్లీన్ ఎయిర్" విషయానికి సంబంధించి ప్రజలలో అవగాహనా ర్యాలీలను చేపట్టి, ఎయిర్ పొల్యూషన్ వలన జరిగే అనర్ధాలను వివరించారు. గాలిలో స్వచ్ఛతను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. విజబుల్ క్లీన్లీనెస్ పారిశుధ్య కార్యక్రమాలను అన్ని సచివాలయాల పరిధులలో చేపట్టి, పలుచోట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పలాస కమిషనర్ మాట్లాడుతూ విరివిగా మొక్కలను నాటి వాతావరణంలో ఆక్సిజన్ శాతాన్ని, స్వచ్ఛతను పెంపొందించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




సైక్లింగ్ ప్రక్రియను ప్రోత్సహించాలని సైకిల్ ర్యాలీలను చేపట్టి గాలిలో స్వచ్ఛత కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మొక్కలు నాటడంతో స్వచ్ఛమైన గాలి వస్తుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. వృక్ష సంపద ఉంటేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందించగలగమని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్లు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడొద్దు.. జీవితాలు నాశనం చేసుకోవద్దు




**ఇచ్ఛాపురం, అక్టోబరు18 (వార్త):** స్థానిక స్వర్ణ భారతి విద్యాసంస్థలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.పరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ కి పాలు పడినట్లయితే ఏ సెక్షన్లు వర్తిస్తాయి ఎలాంటి శిక్షలు అనుభవించవలసి ఉంటుంది అనే విషయాన్ని తెలియజేశారు. సిఐ ఎం.చిన్నంనాయుడు ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణ భారతి విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ఈగల్ క్లబ్ మరియు స్టూడెంట్ కౌన్సిలింగ్ కమిటీ ఆధ్వర్యంలో చెడు సంఘటనలు జరగకుండా విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగే విధంగా కార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు. విద్యాసంస్థల కోఆర్డినేటర్ చాట్ల మహేశ్వరి రెడ్డి(టీనా) మాట్లాడుతూ విద్యార్థులు సీనియర్లు జూనియర్లు స్నేహపూర్వక వాతావరణం లో మేలగాలని, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉలాల దివ్య భారతి, టౌన్ ఎస్ ఐ ఎం. ముకుందరావు , అడ్వకేట్ దక్కత కృష్ణమూర్తి, కళాశాల ఇంచార్జ్ చాట్ల రాము , ప్రిన్సిపల్స్ సందీప్, జల్లు జయప్రకాష్, శ్రీనివాస్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## లక్కవరంలో ముందస్తు దీపావళి

**సోంపేట, అక్టోబరు 18(వార్త):** లక్కవరం గ్రామంలో దీపావళి ముందస్తుగా జరుపుకున్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్ కిరణ్ కుమార్ శనివారం దీపావళి వేడుకను పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆది సోమవారాలు సెలవు కావడంతో విద్యార్థులకు దీపావళికి సంబంధించిన కథను వివరించి దీపాలను వెలిగించి ఈ పండుగ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని స్వాతి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి లక్ష్మీ పూజ నిర్వహించారు.

## రైతుబజారు కోసం సీపీఎం ఉద్యమం



**పలాస, అక్టోబరు 18(వార్త):** పలాసలో రైతుబజారు ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు టి అజయ్ కుమార్ వి కృష్ణారావులు మాట్లాడుతూ పలాసలో రైతు బజారు ఏర్పాటు అన్నది పట్టణ ప్రజల చిరకాల కోరికగా మిగిలిపోయిందని అన్నారు. పాలకులు ఎవరు మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. పట్టణ ప్రజలు రైతు బజారు ఏర్పాటుకై జరిగే ఆందోళనలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజలను చైతన్య పరుస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. శనివారం తిలక్ నగర్ పరిసరాలలో చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెప్పల రాజు యం పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## సొండిపూడిలో రీసర్వే పరిశీలన



**మందస, అక్టోబరు 18(వార్త):** రీ సర్వేను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ ఆదేశించారు. మందస మండలంలోని సొండిపూడి గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే ఫేజ్–3 కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలు లేకుండా సర్వే చేయాలన్నారు. గతంలో ఉన్న భూసమస్యలు రీసర్వేతో పరిష్కారం కావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బొడ్డపాటి బాబురావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుబ్రమణ్యశర్మ, గ్రామసర్వేయర్స్, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

**కోటబొమ్మాళి, అక్టోబరు 18(వార్త):** ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు వినియోగించుకోవాలని స్థానిక ఎస్ఐ వి. సత్యన్నారాయణ తెలిపారు. శనివారం కొత్తపేటలోని సాయికోమలి ఆసుపత్రిలో శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో గుండెకు సంబందించిన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ శిభిరానికి 102 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరీక్షలు జరిపి మందుల పంపిణీ చేసేందుకు గాను ఎస్ఐ అభినందించారు. ఈ శిభిరంలో గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ కెల్లి. సతీస్, డాక్టర్ ప్రభు, నిర్వాహకులు పట్నాన షణ్ముఖరావు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఇచ్ఛాపురంలో క్లీన్ ఎయిర్

**ఇచ్ఛాపురం, అక్టోబరు18 (వార్త):** ఇచ్ఛాపురం పరిధిలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా క్లీన్ ఎయిర్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ గర్ల్ హై స్కూల్, బాయ్స్ హైస్కూల్ విద్యార్థులతో క్లీన్ఎయిర్ నమూనాను ఏర్పాటు చేసి అవగాహన కల్పిం చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టి, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. గాంధీ పార్కు లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంచార్జ్ కమిషనర్ యాధం అప్పలస్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సూర్యారావు పాల్గొన్నారు.





## లల్లూకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**సోంపేట, అక్టోబరు 18(వార్త):** ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాల్(లల్లూ) జన్మదినం శనివారం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం ఇంచార్జ్ పిరియా సాయిరాజ్ తో పాటు అనేకమంది నాయకులు కార్యకర్తలు స్నేహితులు కంచిలిలో గల లల్లూ స్వగృహం వద్ద ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో చల్లగా వర్ధిల్లాలని లల్లూను ఆశీర్వదించారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రపై ర్యాలీ




**సోంపేట, అక్టోబరు 18(వార్త):** సోంపేటలో ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రపై మెయిన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ మండపం కూడలిలో ప్రతిజ్ఞ చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరం కట్టుబడి ఉందామని ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలోనూ గ్రామాల్లోనూ పరిశుభ్రతకు పెద్దపీటవేసేలా అందరినీ చైతన్యపరచాలని అధికారులు కోరారు. పర్యావరణానికి పెను భూతంగా మారిన ప్లాస్టిక్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిర్మూలించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, పంచాయతీ ఈవో శాంతకుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## చెకుముకి ప్రతిభా పరీక్షలతో శాస్త్రీయ దృక్పథం



**మందస, అక్టోబరు 18(వార్త):** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ, జన విజ్ఞాన వేదిక సహకారంతో నిర్వహిస్తున్న చెకుముకి ప్రతిభా పరీక్షల ప్రశ్న పత్రాలను పల్లిసారథిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వాహకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుంట కోదండరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 25 వేలమంది 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతీ తరగతి నుండి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు నవంబర్ 1న మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. చెకుముకి పరీక్షలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని మెరుగుపరచడానికి దోహదకారిగా ఉండడం వల్ల ఉపాధ్యాయుల ఆదరణతో గత 36సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరము హైస్కూల్స్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కె.మాధవరావు, బి.అన్నపూర్ణ నిర్వహించగా ఎస్.పాపారావు, ఎం.హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసన

**మందస, అక్టోబరు 18(వార్త):** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు నిరసనగా మందస మండలంలోని భోగాపురం గ్రామంలో మందస మండల వైఎస్సార్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన, రచ్చబండ కార్యక్రమం జరిగింది. దీంతో పాటు కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం కూడా నిర్వహించారు. ప్రభుత్వ వైఖరి పట్ల వైకాపా నాయకులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, ఉపాధ్యక్షుడు పులారి పితాంబరం, పార్టీ నాయకులు మడియా రామకృష్ణ, సురేష్ కుమార్ పాణిగ్రాహి, బత్తిన లక్ష్మణ్, దున్న హరికృష్ణ, డాక్టర్ జయరాం, బెలమర జీవన్, అగ్గున్న దేవేంద్ర, రాపాక శేషగిరి, గున్న రమణ, అగ్గున్న కిరణ్, జోగేంద్ర, ప్రసన్న, భుభిని తదితరులు పాల్గొన్నారు.



# శభాష్ చిన్నారులూ..!

-వాయు కాలుష్యంపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులను అభినందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



**సారవకోట, అక్టోబరు18(వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం సాగుతున్న సంగతి తెలిసిందే. శనివారం వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రత్యేకంగా చేస్తున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పర్యటనలో ఆసక్తికర సంఘటన జరిగింది. శనివారం నరసన్నపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. పలు శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలసి పాల్గొన్నారు. నరసన్నపేట నియోజకవర్గం సారవకోట మండలంలో పర్యటిస్తున్న సమయంలో నౌతల కూడలి లో చిన్నారులు చేస్తున్న స్వచ్ఛంధ్ర కార్యక్రమం కేంద్ర మంత్రి దృష్టిని ఆకర్షించింది. వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా నినదిస్తూ.. సైకిళ్లలతో చిన్నారులు ర్యాలీ చేపట్టడం అక్కడి వారిని ఆలోచింపజేసింది. ఈ నేపథ్యంలో తన కాన్వాయ్ ను ఆపి చిన్నారులతో ముచ్చటించారు. మంచి కార్యక్రమం చేస్తున్నారంటూ కితాబిచ్చారు. ప్రతీ ఒక్క చిన్నారి మొక్కలను కూడా నాటాలని కోరారు.

# శత శాతం స్వచ్ఛ ఆంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

**మందస, అక్టోబరు 18(వార్త):** ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో విజన్–2047లో భాగంగా ప్రతీ నెల మూడవ శనివారం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రోగ్రాం అన్ని గ్రామాల్లో శత శాతం విజయవంతమైనప్పుడే స్వర్ణాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని బాలిగాం పంచాయతీ వీరభద్ర, కొత్తపల్లి పంచాయతీలో ముకుందపురం గ్రామాల్లో మహిళా సంఘాల పుస్తకాలను పరిశీలిస్తూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేసిన సాసా కార్యక్రమం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భూమి మీద గల సమస్త జీవరాశుల ఉనికికి అతి ముఖ్యమైన ఆక్సిజన్ ను పెంచడానికి అందరూ బాధ్యతతో విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. ప్రకృతిలో గాలి నాణ్యతను పెంచడానికి విస్తారంగా పెరుగుతున్న వాయు కాలుష్యంలో వీలైనంత మేరకు వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి, మనుషుల ఆరోగ్యాన్ని పెంచడానికి



అవకాశాన్ని బట్టి కాలినడకను, అవసరం మేరకు సైకిల్ తొక్కే కార్యక్రమాలపై, సోలార్ విద్యుత్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో జల కాలుష్యం, వాయు కాలుష్యం లేకుండా పరిశుభ్రమైన గ్రామాలను సాధించే సంకల్పానికి మహిళలు కట్టుబడి ఉన్నప్పుడు మాత్రమే స్వచ్ఛ మందస, స్వచ్ఛ శ్రీకాకుళం, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ తో పాటు స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వీవోఏలు మోహిని, చంద్రకళతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు మీనాక్షి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని సమష్టిగా నిర్మూలిద్దాం



**మెళియాపుట్టి, అక్టోబరు 18(వార్త):** ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్న దృశ్య ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిరోధానికి ప్రతి ఒక్కరం సమిష్టిగా కృషిచేసి నిర్మూలిద్దమని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా పిలుపునిచ్చారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శనివారం నుండి నిర్వహించారు. స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమంలో చేపట్టే అంశాలలో భాగంగా మొక్కలు నాటడం, పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ సైక్లింగ్ చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని, గ్రామాలలో ఉండే కిరాణా తదితర ప్రతి షాపులో ధరల పట్టిక తప్పనిసరిగా వేలాడదీయాలని, జీఎస్టీ పై అవగాహన పెంపొందించుకోవాలని గ్రామంలో నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తో పాటు వ్యవసాయధికారి దానకర్ణుడు, మండల విద్యాశాఖధికారులు దేవేంద్రరావు, పద్మనాభం,ఏపీవో రవి, ఉపాధ్యాయులు గోవిందరావు, అనిల్ కుమార్, టిడిపి నాయకుడు పరమేశ్వర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

**కోటబొమ్మాళి, అక్టోబరు 18(వార్త):** కోటబొమ్మాళి మండలంలో ధనత్రయోదశిని పురస్కరించుకొని శనివారం నాయీబ్రహ్మణలు ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల నాయీబ్రహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రహ్మణ జిల్లా ఉపాధ్యాక్షుడు నౌగాపు నాగరాజు అద్వర్యంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల కులద్కెవమైన భగవన్ ధన్వంతరి జన్మదిన వేడుకలు గత పది సంవత్సరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నామని, పురాణాల ప్రకారం దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనం చేస్తున్నప్పుడు ధనత్రయోదశి రోజున విష్ణువు ధన్వంతరి అవతారంలో అమృత కలశాన్ని పట్టుకుని కనిపించాడని పురాణాలు చెబుతున్నాయని అందుకే అదే రోజున ధన్వంతరి పుట్టినరోజుగా భావిస్తారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏటా ధన్వంతరి జయంతి జరుపుకొని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈ శాన్య దిశలో ధన్వంతరి విగ్రహం ఉంచి ప్రార్థిస్తే దీర్ఘాయువు లభిస్తుందని చాలా మంది నమ్ముతారన్నారు. నాయీ బ్రహ్మణ కులద్కెవం అయిన ధన్వంతరి శ్రీ మహావిష్ణువు అవతారమని పూర్వకాలంలో గొప్పగొప్ప ఆయుర్వేదిక వైద్యులు ధన్వంతరి అనే బిరుదుతో సత్కరించే వారన్నారు. ఆరోగ్యానికి ఆదిదేవత అయిన ధన్వంతరిని సకాల రోగాల విముక్తికై ఈ ధన్వంతరి పూజా ధ్యానం చేస్తుంటారని నాగరాజు పేర్కొన్నారు.



వారనాశి సంస్కృతి మ్యూజియంలో, తమిళనాడు శ్రీరంగం రంగనాథస్వామి ఆలయంలో, కేరళలో రెండు దగ్గరల, తస్సూర్‌లో, కాళికట్‌లో, ఏపీలో తూర్పుగోదావరి జిల్లాలో చింతలూరులో ధన్వంతరి ఆలయాలు ఉన్నాయని ఇక్కడ నిత్యపూజలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస శోభారాణి, లక్ష్మి, కనకరాజు, వీరాస్వామి, ఆర్మీ శ్రీనివాస్, జనసేన నాయకులు ప్రసాద్, సందీప్, వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎన్‌సీసీ కేడట్ల ఎంపిక



**పలాస, అక్టోబరు 18(వార్త):** పలాస ఎస్.బి.ఎస్.వై.ఎమ్ డిగ్రీ కళాశాలలో ఎన్.సి.సి (జాతీయ క్యాడెట్ దళం) ఎంపిక కార్యక్రమాన్ని ఆంధ్ర 14వ బెటాలియన్ సుబేదార్ మేజర్ బలవత్ సింగ్, జితేంద్రకుమార్, సిహెచ్.ఎమ్.ఆర్ రవికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రవీణ్‌కుమారి తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి శారీరక, దృఢత్వం నాయకత్వం సేవాభావం పెంపొందించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పరుగు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్.సి.సి కేర్ టేకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వంకల రాజు పాల్గొన్నారు.

# పేదలకు అన్యాయం చేస్తే సహించం : కృష్ణదాస్

**జలుమూరు, అక్టోబరు18(వార్త):** ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్న టీడీపీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. నరసన్నపేట నియోజకవర్గం, జలుమూరు మండలం కరవంజ, బసివాడ గ్రామంలో శనివారం జరిగిన 'రచ్చబండ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'కోటి సంతకాల' సేకరణ కార్యక్రమం కూడా ఉధృతంగా జరిగింది. ప్రసంగంలో ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం, పేద విద్యార్థులు డాక్టర్లు కావాలనే లక్ష్యంతో మా అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ప్రైవేటుపరం చేయాలని చూస్తోంది. పేదలకు అన్యాయం జరిగితే వైఎస్సార్సీపీ చూస్తూ ఊరుకోదు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకోవడానికి ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజల్లో చైతన్యం నింపాలని ఉద్వేగభరితంగా ప్రసంగించారు. వైఎస్సార్సీపీ పాలనలో పేదవారు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం, విద్యను అందుకున్నారు. ప్రజల



గుండెల్లో జగన్ గారు పదిలంగా ఉన్నారు. ఆయన ప్రజా సంక్షేమ లక్ష్యానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న ప్రైవేటీకరణ నిర్ణయాలను ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరవంజ, పాగోడు, హుస్సేనుపురం, గుగ్గిలి క్లస్టర్ మరియు బసివాడ , టెక్కలిపాడు రాయిపాడు పరిధిలోని గ్రామ కమిటీ సభ్యులతో జరిగిన ఈ రచ్చబండకు భారీ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు దామ మన్మధరావు, జిల్లా కార్యదర్శి మెజ్జాడ శ్యామలరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్ మోహన్, నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కరవంజ కుర్మారావు, మండల యూత్ అధ్యక్షులు జుత్తు నేతాజీ, మండల విభాగం అధ్యక్షులు పొన్నాడ ముసలి నాయుడు, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు నవిరి పోతయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కర్రి అయ్యప్ప, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు దువ్వరపు ప్రసాద్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు బుద్దల శ్రీనివాస్, మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు బోర సింహాచలం, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులు ఉంకిల్ గోపాలకృష్ణ, ఎంపిటిసిలు తర్ర జీవరత్నం, పాగోటి చందనబాబు, బెండి ఎర్రన్న, సర్పంచ్లు బలగ లక్ష్మి అర్జున్, ధర్మాన భువాజీ , ధర్మాన ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



## చట్టాలపై అవగాహనకే న్యాయ విజ్ఞాన సదస్సులు

**మందస, అక్టోబరు 18(వార్త):** సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతోందని సోంపేట కోర్టు ఆరవ అదనపు జిల్లా జడ్జి కె. కిషోర్ బాబు పేర్కొన్నారు. మందస మండలంలోని పెట్టువ గిరిజన గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువు ద్వారానే విజ్ఞానం లభిస్తుందని తద్వారా ఏ పని చేయాలి.. ఏ పని చేయకూడదో తెలుస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు భారత రాజ్యాంగంలో అనేక అంశాలు లిఖించినప్పటికీ, 1989లో చట్టం చేయబడిందని, వారికి భద్రత ఏర్పడిందని అన్నారు. సదస్సులో సీనియర్ న్యాయవాది మడ్డు సర్వేశ్వరరావు మాట్లాడుతూ కులవివక్షత, అంటరానితనం ఏమైనా ఉంటే పోలీస్ లను ఆశ్రయించడం ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రక్షణగా చట్టం ఉందని అన్నారు. ప్రజలు అవగాహన చేసుకోవాలన్నారు. ప్రజలకు న్యాయం చేసేందుకు కోర్టులున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వై.కృష్ణమోహన్, ఎంసీహెచ్ శ్రీనివాసరావు, కె.రాజు, జగదీష్ పండా, ట్రైనింగ్ ఎస్ఐ వెంకటేష్, ఎంఎల్ఎస్ఎస్ సిబ్బంది సుజాత, పీటర్, స్థానికులు పాల్గొన్నారు.

## జ్ఞానభారతిలో ముందస్తు దీపావళి సంబరాలు



**ఇచ్ఛాపురం, అక్టోబరు18(వార్త):** జ్ఞానభారతి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను పాఠశాల కార్యదర్శి సీఈవో జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాం. 'ఆంగ్ల అక్షరాల హ్యాపీ దివాలి ' ఆకారంలో విద్యార్థులు కూర్చొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.బి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, పరిపాలన అధికారిని సయ్యదా, సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు. రవీంద్ర భారతి స్కూల్ లో ప్రిన్సిపాల్ గెదల కన్నం నాయుడు ఆధ్వర్యంలో దీపావళి సంబరాలు నిర్వహించారు. పంజా వీధి పాఠశాలలో హెచ్‌ఎం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు.

## పొగాకు, డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



**కోటబొమ్మాళి, అక్టోబరు 18(వార్త):** కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, గ్రామ పెద్దలు, మెడికల్ సిబ్బంది కలసి పొగా, డ్రగ్స్ కు సంబంధిత ఉత్పత్తులు వాడవద్దు అని కళా జాతాలు, వీధి నాటకాలు, ఒగ్గుకథలుతో ప్రచారం చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి చైతన్య గీతాలు ఆలపించారు. ర్యాలీలో తన బాధ్యతగా సిమ్మ సింహాచలం గ్రామ పెద్ద పాల్గొని మాదకాలు వల్ల అనర్థాలు తెలియజేశారు. షణ్ముఖ మాస్టర్ ఆధ్వర్యం లో ప్రదర్శించిన డ్రగ్స్ వద్దు బ్రో ఒగ్గు కథ ఆకట్టుకుంది. డ్రగ్స్ వాడకం లేదా ట్రాఫికింగ్ గుర్తిస్తే 1972 లేదా 112 కి తెలపాలని కోరారు. కార్యక్రమంలో శాంతకుమారి, గోవిందరావు, గోవిందరావు, కామేశ్వరరావు, సుజాత, గౌరీ, దామోదర రావు, తిరుపతి, గోపి, సునీల్, వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పరీక్షలతో ప్రేరణ

**పోలాకి, అక్టోబరు18(వార్త):** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆలోచనా శక్తి పెంపొందించడానికి చెకుముకి వంటి ప్రతిభా పరీక్షలు ఎంతో ఉపయోగకరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు ప్రధానోపాధ్యాయులు జి.శాంతి పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక యువత జిల్లా కన్వీనర్ బాడాన రాజు ఆధ్వర్యంలో పాంశాలలో చెకుముకి ప్రారంభ పరీక్ష నిర్వహించారు. పాఠశాల నుండి మొత్తం 104 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా యువత కన్వీనర్ బాడాన రాజు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింతాడ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సారవకోటలో అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి



**సారవకోట, అక్టోబరు18(వార్త):** సారవకోట మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పలువురు ముఖ్య నాయకులు కలిసి కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమైన పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సవర మాలువ నుంచి కాలనీ మాలువ వరకు 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డుకు, కేసి రోడ్డు నుండి సవర కురిడింగి వరకు 65 లక్షల రూపాయలతో నిర్మించిన తారు రోడ్డుకు, అలాగే సారవకోట %-% కిడిమి రోడ్డు నుండి పద్మపురం వరకు 180 లక్షల రూపాయలతో నిర్మించిన తారు రోడ్డుకు శుభారంభం చేశారు. అలాగే కుమ్మరిగుంట గ్రామంలో 43.60 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని కూడా ప్రారంభించారు. తరువాత వడ్డినివలస %-% కొమనాపల్లి రోడ్డు నుండి తర్లి గ్రామం వరకు 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రివర్యులకు ఘన స్వాగతం పలికారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి కొనసాగుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సామాన్యులకు అందుబాటులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**జలుమూరు, అక్టోబరు18(వార్త):** చల్లవానిపేట వంశధార డిగ్రీ కళాశాల ఆవరణలో జేమ్స్ హాస్పిటల్ రాగోలు వారి సౌజన్యంతో చల్లవానిపేట సర్పంచ్ పంచి రెడ్డి రామచంద్ర రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు మెగా వైద్య శిబిరానికి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలకు వస్తున్న పలు క్యాన్సర్ వ్యాధులు పట్ల ముందస్తు తనిఖీలు నిర్వహించి చికిత్స చేస్తున్నారని అన్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలతో జాగ్రత్తలు పాటించి ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, తగు సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ శ్రీ పంచిరెడ్డి రామచంద్రారావుని, జేమ్స్ ఆసుపత్రి యాజమాన్యం మరియు వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు



అర్చన మరియు జలుమూరు మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణ, రచ్చబండ పోస్టర్ ఆవిష్కరణ



**కోటబొమ్మాళి, అక్టోబరు 18(వార్త):** అక్కయ్యవలస, కిష్టుపురం, కన్నేవలస, కొత్తపేట పంచాయతీలో "ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం" యొక్క పోస్టర్ ఆవిష్కరణ చేసి టెక్కలి నియోజకవర్గ ఇంచార్జి పేరాడ తిలక్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు హేమసుందర్ రాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రామారావు, జెడ్పీటీసీ వెంకటరావు, నందిగాం ఎంపిపి శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వినోద్, పెడాడ వెంకటరావు, బాగాది దివాకర్, జనార్ధన్ రెడ్డి, వైస్ ఎంపిపి దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్లు ఎంపీటీసీలు కాళ్ళ సంజీవ్, గొద్దు చిరంజీవి, పొన్నాడ మోహన్, కార్యకర్తలు, మహిళలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546